నేటి నుంచి కార్తీక మాసోత్సవాలు

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న గంగు ఉపేంద్రశర్మ

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 1 : చారిత్రక వేయి స్తంభాల రుద్రేశ్వరాలయంలో శనివారం నుంచి డిసెంబర్ 1 వరకు కార్తీక మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ, ఈవో వెంకటయ్య తెలిపారు. శుక్రవారం ఆలయంలో ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గంగు ఉపేంద్రశర్మ మాట్లాడుతూ ఈ నెల 4న ప్రథమ సోమవారం సందర్భంగా రుద్రేశ్వరస్వామికి ప్రత్యేక రుద్రాభిషేకాలు, 5న మంగళవారం నాగుల చవితి, 15న శుక్రవారం కార్తీకపౌర్ణమి సందర్భంగా ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 1 గంటలకు ప్రత్యేక రుద్రాభిషేకాలు, సాయంత్రం 6 గంటలకు లక్ష దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు మణికంఠశర్మ, సందీప్‌శర్మ, సిబ్బంది మధుకర్, రామకృష్ణ, భక్తుడు రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

స్నిగ్ధకు మంత్రి అభినందన

స్నిగ్ధను అభినందిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హసన్‌పర్తి, నవంబర్ 1: జోగులాంబ గద్వాల్ జిల్లాలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయిలో తైక్వాండో పోటీల్లో మండలంలోని జయగిరికి చెందిన తాళ్లపెల్లి స్నిగ్ధగౌడ్ అండర్-17(68 కేజీల) విభాగంలో పాల్గొని సిల్వర్ మెడల్ సాధించింది. ఈ మేరకు ప్రతిభ కనబరిచిన స్నిగ్ధను మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం తన క్యాంపు కార్యాలయంలో శాలువాతో సత్కరించి అభినందించారు. అలాగే, జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు రాజు, జీవన్‌గౌడ్, జన్ను ఆనంద్‌కుమార్, విజయ్ కూడా స్నిగ్ధను అభినందించారు.

ఫోన్ పోతే సీఈఐఆర్‌లో ఫిర్యాదు చేయాలి

పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా

బాధితురాలికి ఫోన్ అప్పగిస్తున్న సీపీ

నయీంనగర్, నవంబర్ 1 : ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే చింతించవద్దని, తక్షణమే సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని పోలీస్ కమిషనర్ అంబర్‌కిశోర్‌ఝా సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సీసీఎస్ పోలీసుల ఆధ్వర్యంలో సెల్‌ఫోన్ రికవరీ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ల ఆచూకీ కనుగొని, స్వాధీనం చేసుకున్న ఫోన్లను సీపీ చేతుల మీదుగా యజమానులకు అందజేశారు. అనంతరం సీపీ మాట్లాడుతూ పోగొట్టుకున్న ఫోన్‌ల ఆచూకీ కోసం ప్రతి స్టేషన్‌లో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కమిషనరేట్ పరిధిలో ఇప్పటి వరకు 8,226 మంది సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయగా ఇందులో 4,931 సెల్ ఫోన్లను గుర్తించినట్లు తెలిపారు. అందులో ఇప్పటి వరకు 3,257 ఫోన్లను స్వాధీనం చేసుకొని యజమానులకు అందజేశామని చెప్పారు. వారం రోజులుగా సీసీఎస్ పోలీసులు శ్రమించి మరో 55కు పైగా ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం ఫోన్లను కనుగొనడంలో ప్రతిభ కనబర్చిన పోలీసులను సీపీ అభినందించారు. కార్యక్రమంలో క్రైమ్ ఏసీపీ భోజరాజు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు బాలాజీ వరప్రసాద్, రఘుపతిరెడ్డి, ఐటీ కోర్ హెడ్ కానిస్టేబుల్ మాధవరావు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వోగా అప్పయ్య బాధ్యతల స్వీకరణ

వరంగల్, నవంబర్ 1 : జిల్లా వైద్యాధికారిగా డాక్టర్ అప్పయ్య గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు ఆయన కలెక్టర్ ప్రావీణ్యతోపాటు పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా, నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ లిలితాదేవి, వరంగల్ డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు, ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డాక్టర్ మహేందర్, డాక్టర్ గోపాల్‌రావు, ఏడీ యాదగిరి, ఏవో రమేశ్, డెమో అశోక్‌రెడ్డి, ఎస్‌వో ప్రసన్నకుమార్, ఫార్మాసిస్టుల సంఘం అధ్యక్షుడు బత్తిని సుదర్శన్ గౌడ్, శరత్‌బాబు, ఫాతిమా, పలువురు యూనియన్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే నాయినిని కలిసిన టీఎన్జీవోలు

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న టీఎన్జీవోలు

హనుమకొండ, నవంబర్ 1: వరంగల్ పశ్చిమ నియోజక వర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని హనుమకొండ జిల్లా టీఎన్జీవోలు మర్యాద పూర్వకంగా కలిసారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో కలిసి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉద్యోగులకు,వారి కుటుంబ సభ్యులకు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షులు పుల్లూరు వేణుగోపాల్, కేంద్ర సంఘ నేతలు మోయిజ్, లక్ష్మీప్రసాద్, జిల్లా నేతలు చీకటి శ్రీనివాస్, రాజీవ్ ఉన్నారు.

ఇదేందయ్యా.. ఇది!

పార్కింగ్ చేసిన వాహనాలకు ఫొటోలా?.. పోలీసుల తీరుపై వాకర్స్ మండిపాటు

ఆర్ట్స్ కాలేజీ ఎదుట పార్కింగ్ చేసిన వాహనాల ఫొటో తీస్తున్న ట్రాఫిక్ పోలీసు

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 1 : వాహనదారుల నుంచి ఆదాయాన్ని రాబట్టేందుకు ట్రాఫిక్ పోలీసులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. వాకింగ్ కోసం వచ్చి న వారి వాహనాల ఫొటోలు తీసుకుంటున్నారు. చిర్రెత్తుకొచ్చిన వాకర్స్ 'ఇదేం పోలీసు డ్యూటీ' అంటూ అసహనం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే.. శుక్రవారం ఉదయం ఆర్ట్స్ కాలేజీలో వాకింగ్ చేసేందుకు వచ్చి తమ వాహనాలను బయట రోడ్డుపక్కన నిలిపారు. 8 గంటల ప్రాంతంలో వచ్చిన ట్రాఫిక్ పోలీసులు వాటిని ఫొటోలు తీసి చలాన్లు వేశారు. దీన్ని గమనించిన వాకర్స్ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు వస్తే.. పండుగ పూట ట్రాఫిక్ పోలీసులు తమ జేబులకు చిల్లులు పెడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

ఘనంగా దీపావళి వేడుకలు

- ఊరూరా సంబురాలు జరుపుకున్న ప్రజలు
- ఆలయాల్లో భక్తుల పూజలు

హనుమకొండ : మానసిక దివ్యాంగ చిన్నారులకు స్వీటు తినిపిస్తున్న ఎంపీ కడియం కావ్య

ఐనవోలు: ఆలయంలో శివలింగ ఆకారంలో దీపాలు వెలిగిస్తున్న ఈవో నాగేశ్వర్‌రావు

హనుమకొండ/కాజీపేట/న్యూశాయంపేట/హనుమకొండ చౌరస్తా/ శాయంపేట, నవంబర్ 1: దీపావళి వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. హనుమకొండ బాలసముద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో మానసిక దివ్యంగ చిన్నారులతో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య శుక్రవారం దీపావళి వేడుకలు జరుపుకున్నారు. చిన్నారులతో కలిసి క్రాకర్స్ కాలుస్తూ జాగ్రత్తలు చెప్పారు. ప్రతి పండగను చిన్నారులతో కలసి జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం చిన్నారులకు ఎంపీ స్వయంగా స్వీట్స్ తినిపించి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, గురువారం హనుమకొండ కనకదుర్గ కాలనీలో ఎంపీ నివాసంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరిని మల్లికాంబ మనోవికాస కేంద్రం చిన్నారులు కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవి, కేంద్రం నిర్వాహకులు రామలీల, కల్యాణ్ పాల్గొన్నారు. కాగా, మల్లికాంబ మనో వికాస కేంద్రంలో పిల్లలకు అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్, కేయూ పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనితారెడ్డి పటాకులు అందించి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సుచరిత, రాజేందర్ రెడ్డి, రాధ పాల్గొన్నారు. కాజీపేట ఫాతిమానగర్‌లోని హౌజ్‌ఆఫ్ జాయ్ ఆశ్రమంలో డాక్టర్ రాజేంద్రప్రసాద్-భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మానసిక దివ్యాంగులు, వృద్ధులు పటాకులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు. ఆశ్రమం ఇన్‌చార్జి సిస్టర్ నిర్మల, ఆర్గనైజర్ శ్రవణ్, కోఆర్డినేటర్ మోహన్ పాల్గొన్నా రు. హంటర్‌రోడ్డులోని శ్రీ వ్యాస ఆవాసంలో సులక్ష్య సేవాసమితి సభ్యుడు మండవ సంతోష్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కోడం వినయ్, సాయికిరణ్, భరత్, తేజ్, వ్యాస ఆవాస ప్రతినిధి రంజిత్ పాల్గొన్నారు. గ్రేటర్ 5వ డివిజన్ హనుమాన్‌నగర్ ఫేజ్-1 కాలనీలో జరిగిన వేడుకలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, మొట్ల మనోహర్, కుమార్‌రెడ్డి, వెంకటేశ్, గణేశ్ పాల్గొన్నారు. శాయంపేట మండల వ్యాప్తంగా శుక్రవారం వేడుకలు నిర్వహించారు.

ఆలయాల్లో ఘనంగా పూజలు

ఐనవోలు/హనుమకొండ : దీపావళి సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఐనవోలు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, శివలింగం, ఓం, స్వస్తిక్ ఆకారాల్లో దీపాలను అలంకరించి, జ్యోతులు వెలిగించారు. కార్యక్రమంలో ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు, అర్చకులు ఐనవోలు మధుకర్‌శర్మ, పాతర్లపాటి శ్రీనివాస్, అర్చకులు భానుప్రసాద్, నరేశ్‌శర్మ, శ్రీనివాస్, దేవేందర్ పాల్గొన్నారు. అలాగే, హనుమకొండ పద్మాక్షికాలనీలోని సిద్ధేశ్వరాలయంలో స్వామివారికి అన్నపూజ, కుష్మాండ హారతి నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించినట్లు అర్చకుడు సిద్ధేశుని సురేశ్‌కుమార్ తెలిపారు. అలాగే, హనుమద్గిరి పద్మాక్షి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించినట్లు అర్చకుడు నాగిళ్ల శంకర్‌శర్మ, ఆస్థాన వేదపండితుడు నాగిళ్ల షణ్ముఖ పద్మనాభ అవధాని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

రైలు నుంచి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

కమలాపూర్, నవంబర్ 1 : మండలంలోని ఉప్పల్-జమ్మికుంట రైల్వే స్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి రైలు నుంచి పడి మృతి చెందినట్లు కాజీపేట రైల్వే హెడ్ కానిస్టేబుల్ జీ తిరుపతి శుక్రవారం తెలిపారు. భీంపల్లి శివారులో 35-40 ఏళ్ల వయసు గల వ్యక్తి తీవ్రగాయాలతో ట్రాక్ పక్కన పడి ఉండగా గ్రామస్తులు 108కు సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది చేరుకుని అతడిని పరిశీలించగా మృతిచెందినట్లు నిర్ధారించారు. బతికి ఉన్నప్పుడు గ్రామస్తులు అడిగినప్పుడు అతడు మంథని దగ్గర ఊరు అని చెప్పినట్లు తెలిసింది. కాగా, మృతుడు దివ్యాంగుడు. అతడికి రెండు కాళ్లు లేవు. ఎడమవైపు చాతిపై లత అని తెలుగులో పచ్చబొట్టు ఉంది. అతడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డు లేకపోవడంతో మృతదేహాన్ని జమ్మికుంట దవాఖాన మార్చురీలో భద్రపరిచినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే 99493 04574, 87126 58604 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

ఆత్మకూరు, నవంబర్ 1 : మండల కేంద్రంలో పేకాడుతున్నారనే పక్కా సమాచారం మేరకు దాడులు చేసి గురువారం ఏడుగురిని పట్టుకున్నట్లు సీఐ సంతోశ్‌కుమార్ తెలిపారు. పట్టుబడిన వారిలో ఆత్మకూరు గ్రామానికి చెందిన శ్యామ్, కోల రాజు, రాజేశ్, ఫయాజ్, దేవేందర్, వేణుగోపాల్, చిరంజీవి ఉన్నట్లు పేర్కొన్నారు. వీరి నుంచి రూ.13,400 నగదు, నాలుగు బైక్‌లు, ఏడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై పరమేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి సేవిస్తున్న వ్యక్తి ..

ఎల్కతుర్తి, నవంబర్ 1 : గంజాయి సేవిస్తున్న వ్యక్తిని ఎల్కతుర్తి పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. పోలీస్‌స్టేషన్‌లో సీఐ పులి రమేశ్ మాట్లాడుతూ మండలంలోని గుంటూర్‌పల్లి క్రాస్ రోడ్డు వద్ద ఎస్సై రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా రోడ్డు పక్కన కారు, బైక్‌పై ఇద్దరు వ్యక్తులు అనుమానస్పదంగా కనిపించారు. వారి వద్దకు వెళ్లగా మండలంలోని దామెర గ్రామానికి చెందిన రొడ్డబోయిన శ్రీధర్ పారిపోయాడు. బైక్‌పై ఉన్న కమలాపూర్ మండలం శంభునిపల్లికి చెందిన ఇరువాల అన్వేష్‌ను పట్టుకున్నారు. అతడి వద్ద 100 గ్రాముల ఎండు గంజాయి లభించింది. అతడిని విచారించగా శ్రీధర్ నుంచి కొనుగోలు చేసినట్లు తెలిపాడు. దీంతో అన్వేష్‌ను అరెస్టు చేసిన పోలీసులు కారు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న శ్రీధర్ కోసం గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా, గంజాయి విక్రయిస్తున్న వారిని చాకచక్యంగా పట్టుకున్న ఎస్సై రాజ్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్ సారంగపాణి, సిబ్బంది తిరుపతి, రాజు, నిరంజన్, రంజిత్, వలీ, స్వరూపను సీఐ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నడికూడ, నవంబర్ 1 : మండలం నుంచి పరకాలకు వెళ్లే రహదారిలో పెట్రోల్ బంకు వద్ద రెండు బైకులు ఢీకొన్న ఘటన గురువారం సాయంత్రం జరిగింది. మండలంలోని గొల్లపల్లెకు చెందిన జీల్ల భిక్షపతి పరకాలకు వెళుతున్నాడు. అలాగే, చౌటుపర్తి గ్రామానికి చెందిన వ్యక్తి పరకాల నుంచి నడికూడకు వస్తుండగా పెట్రోలు బంకు వద్ద వారు ఢీకొట్టుకున్నారు. దీంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 ద్వారా వారిని దవాఖానకు తరలించారు.

గాయపడిన వృద్ధుడి మృతి

ఆత్మకూరు, నవంబర్ 1 : మండల కేంద్రంలోని దర్గా వద్ద గత నెల 30న టాటా మ్యాజిక్, ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో గాయపడిన వృద్ధుడు బుధవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై పరమేశ్వర్ తెలిపారు. కమలాపురం మండలం అంబాల గ్రామానికి చెందిన రాజకొంరయ్య(60) ఆత్మకూరు మండలం నాగయ్యపల్లిలో బంధువు దహన కార్యక్రమాలకు వచ్చి, తిరిగి తన ఎక్స్‌ఎల్ వాహనంపై ఇంటికి వెళ్తుండగా దర్గా వద్ద ఎదురుగా వస్తున్న టాటా మ్యాజిక్ ఢీకొట్టింది. తీవ్ర గాయాల పాలైన అతడిని వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కాగా, టాటా మ్యాజిక్ డ్రైవర్ లక్ష్మణ్‌పై చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య రాధ ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

ఆత్మకూరు, నవంబర్ 1 : వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని పరకాల ఏసీపీ కిశోర్‌కుమార్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలో పలు జంక్షన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ జాతీయ రహదారిపై టీ జంక్షన్ వద్ద స్పీడ్ బ్రేకర్లు, ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. గూడెప్పాడ్ జంక్షన్‌లో హైమాస్ లైటింగ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐలు సంతోశ్‌కుమార్, శ్రీనివాస్, ఎస్సై పరమేశ్వర్, డిప్యూటీ ఈఈ కిరణ్‌కుమార్, ఏఈ చేతన్‌కుమార్ పాల్గొన్నారు.

త్వరగా హౌస్ లిస్టును పూర్తి చేయాలి

- కలెక్టర్ పీ ప్రావీణ్య
- సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే తనిఖీ

హసన్‌పర్తి : హౌస్ లిస్టులను తనిఖీ చేస్తున్న కలెక్టర్

హసన్‌పర్తి, నవంబర్ 1 : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే(హౌస్ లిస్టు)ను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులకు సూచించారు. మండలంలోని జయగిరిలో స్పెషల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, గ్రామ సెక్రటరీ రవీందర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సర్వేను శుక్రవారం కలెక్టర్ ప్రావీణ్య, తహసీల్దార్ చల్ల ప్రసాద్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి పూర్తి స్థాయిలో సమాచారం సేకరించి, స్టిక్కర్ వేయాలన్నారు. మ్యాప్ ప్రకారం సర్వే చేయాలని, ఒక్క ఇంటిని కూడా తప్పవద్దని ఆదేశించారు. ఎవరి ఇంటికైన స్టిక్కర్ వేయకపోతే వెంటనే సంబంధింత గ్రామ పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీవో కరుణాకర్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు విజయ, సంపూర్ణ, ఉమదేవి, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీధర్ ఉన్నారు.

సమగ్ర వివరాలతో సర్వే పూర్తి చేయాలి

వరంగల్ : రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 6 నుంచి ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ సర్వేను సమగ్ర వివరాలతో నిర్వహించాలని గ్రేటర్ అదనపు కమిషనర్ జోనా అన్నారు. శుక్రవారం కాశీబుగ్గ సర్కిల్ పరిధిలో సర్వే నిర్వహించనున్న ఎన్యుమరేటర్లకు డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్యుమరేటర్లను ఉద్దేశించి అదనపు కమిషనర్ మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంపికైన మున్సిపల్ సిబ్బందితో పాటు అంగన్వాడీ టీచర్లు, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లకు ప్రభుత్వం 73 ప్రశ్నలతో చేపట్టనున్న సర్వే వివరాలతో శిక్షణా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్వేలో పాల్గొననున్న ప్రతి ఎన్యూమరేటర్ తనకు కేటాయించిన గృహాలకు సంబంధించిన సమాచార జాబితాను సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్వో షహజాదీ బేగం, శ్రీనివాస్, సూపరింటెండెంట్ హబీబ్, టీఎంసీ రమేశ్, ఐటీ మేనేజర్ రమేశ్ పాల్గొన్నారు.

అభివృద్ధి శిలాఫలకాలు మార్చడం మూర్ఖత్వం

సింగరాజుపల్లిలో బీఆర్ఎస్ శ్రేణుల నిరసన

మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు గండు రామకృష్ణ

దామెర, నవంబర్ 1 : ప్రభుత్వం మారితే శంకుస్థాపన చేసిన శిలాఫలకాలు మార్చుతారా..? అంటూ దామెర మండలం సింగరాజుపల్లిలో బీఆర్ఎస్ శ్రేణులు శుక్రవారం నిరసనకు దిగాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో అప్పటి ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ఎస్టీఎస్‌డీఎఫ్ నిధులు రూ3.4కోట్లతో సింగరాజుపల్లి నుంచి హరిచంద్రనాయక్‌తండా వరకు బీటీ రోడ్డును నిర్మించేందుకు గత ఏడాది అక్టోబర్ నెలలో శంకుస్థాపన చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి గురువారం అవే నిధులతో బీటీ రోడ్డును నిర్మిస్తున్నట్లు శిలాఫలకాన్ని మార్చి, శంకుస్థాపన చేయడంపై బీఆర్ఎస్ శ్రేణులు భగ్గుమన్నాయి. దీంతో బీఆర్ఎస్ నాయకులు సింగరాజుపల్లికి చేరుకుని గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని నీటితో శుద్ధి చేసి, పూలదండవేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గండు రామకృష్ణ మాట్లాడుతూ గత ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మంజూరు చేయించిన నిధులను తామే మంజూరు చేసినట్లు కాంగ్రెస్ నాయకులు చెప్పుకోవడం మూర్ఖత్వమన్నారు. ఒక అధికారిక శిలాఫలకం ఉండగా పేర్లు మార్చి మరో శిలాఫలకాన్ని అధికారులు ఎలా ఏర్పాటు చేశారని ప్రశ్నించారు. మాజీ ఎంపీపీ కాగితాల శంకర్ మాట్లాడుతూ శిలాఫలకాన్ని మార్చడం అప్పటి ప్రజాప్రతినిధులను కాంగ్రెస్ ప్రభుత్వం అవమానించడమేనన్నారు. మాజీ వైస్ ఎంపీపీ జాకీర్‌అలీ మాట్లాడుతూ అభివృద్ధి కోసం నిధులను తీసుకురావాల్సింది పోయి పాతపనుల శిలాఫలకాలను మార్చడం హేయమైన చర్య అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పోలం కృపాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు మెంతుల రాజు, దామెర శంకర్, పున్నం సంపత్, సంగనబోయిన కిరణ్, బత్తిని రాజు, బాబు, మాజీ ఎంపీటీసీ రమేశ్, ఉప్పుల సత్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న మున్సిపల్ అధికారులు

పండుగ పూట నీటి కష్టాలు

8వ డివిజన్ ప్రజల ఇబ్బందులు

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 1 : గ్రేటర్ 8వ డివిజన్‌లో నాలుగు రోజుల నుంచి మంచినీటి సరఫరా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పండుగ పూట కూడా నీళ్లు లేకపోవడంతో మున్సిపల్ అధికారులు, సిబ్బంది తీరుపై కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయాన్ని కార్పొరేటర్ బైరి లక్ష్మీకుమారి ఇటీవల డీఈ రవికిరణ్, ఏఈ సతీశ్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించాలని కోరారు. అయినా పరిష్కారం కాకపోవడంతో మేయర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆమె వెంటనే సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో నీరు సరఫరా కాలేదు. దీంతో కార్పొరేటర్ బైరి లక్ష్మీకుమారి ఆందోళనకు దిగారు. ఈ మేరకు ఏఈ సతీశ్ సిబ్బందితో డివిజన్‌ను సందర్శించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. పండుగలకే ఎందుకు ఇలా జరుగుతోందని అధికారులను ప్రజలు నిలదీశారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ చెప్పడంలో ఆందోళన విరమించారు.

మున్నూరుకాపు సంఘం మండల ప్రధాన కార్యదర్శిగా ప్రభాకర్

శాయంపేట, అక్టోబర్ 1 : మున్నూరుకాపు సంఘం మండల ప్రధాన కార్యదర్శిగా సూరంపేట గ్రామానికి చెందిన అడుప ప్రభాకర్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన అందరికీ ప్రభాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

స్వెటర్ మార్కెట్ ప్రారంభం

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 1: హనుమకొండ అశోకా హోటల్ ఎదురుగా ఉన్న పాతమున్సిపల్ మైదానంలో నూతనంగా ఏర్పాటు చేసిన నేపాలి టిబెటన్ స్వెటర్ మార్కెట్‌ను ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఏటా నగర ప్రజలకు ఉలెన్‌తో తయారు చేసిన వివిధ రకాల దుస్తులను అందిస్తున్న వారిని ఎమ్మెల్యే అభినందించారు. నేపాలి టిబెటన్ సంఘం అధ్యక్షుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎన్ఆర్ఐ పింగిలి భగవాన్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు మనోహర్‌రావు పాల్గొన్నారు.

వాల్‌సోస్టర్ ఆవిష్కరణ

వరంగల్, నవంబర్ 1: భద్రకాళీ రోడ్డులోని ధర్మశాస్త అయ్యప్ప ఆలయంలోని భక్త సేవాశ్రమంలో వ్యవస్థాపకుడు టీఆర్ బాలసుబ్రహ్మణ్యశర్మ చేతుల మీదుగా కార్తీక మాసం మండల దీక్ష వాల్‌పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. శనివారం నుంచి భక్తులకు మాలధారణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. మొదటి సారి మాలధారణ చేసే కుచ్చు స్వాములకు(బాలలకు) ఉచిత మాలధారణతో పాటు స్వామి వారి శేషవస్త్రాలను అందించనున్నట్లు తెలిపారు.

పీఏసీఎస్ పాలకవర్గానికి నోటీసులు

శాయంపేట, నవంబర్ 1: శాయంపేట పీఏసీఎస్ పాలకవర్గానికి జిల్లా సహకార శాఖ అధికారి నోటీసులు జారీ చేశారు. సంఘంలో నిధులు దుర్వినియోగం జరిగినట్లు ఫిర్యాదులు అందడంతో స్పెషల్ విచ